


# 32 ఏళ్లుగా భారీ గణనాథుడి ప్రతిష్ఠ.. ఘనంగా నిమజ్జనం

❖ *గణనాదుడి సేవలో చంద్రబాబు నాయుడు నగర్ బస్తీవాసులు*

**దశ, ఓయూ:** తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేట చంద్రబాబు నాయుడు నగర్ బస్తీలో 32 ఏళ్లుగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోళ్ల వెంకటేష్ యాదవ్ తన సొంత ఖర్చులతో భారీ గణనాథుడిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ బస్తీ ప్రజలను ఏకం చేస్తున్నారు.నవరాత్రి ఉత్సవాల అనంతరం శుక్రవారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువత, భక్తులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, డప్పుల మోతల నడుమ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం గణనాథుడిని ట్యాంక్‌బండ్‌కు తరలించి నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో బస్తీకి చెందిన కోళ్ల హరి యాదవ్, విఘ్నేష్, ముక్కల రాముడు, గోకరి చందర్, రాజు, మల్లేష్, ప్రభాకర్, కేట్లయ్య, డి. చంద్రన్న, గోకరి తదితరులతో పాటు బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాండూరులో ప్రైవేట్ విద్యా 'మాఫియా' దౌర్జన్యం




- 12 గంటలపాటు కుర్చీలకే బందీలుగా విద్యార్థులు!
- ప్రభుత్వ ఆదేశాలు తుంగలో.. సొంత రాజ్యాంగం అమలు!
- ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు నరకయాతన -రోబోలుగా మారుతున్న చిన్నారులు
- మామూళ్ల మత్తులో విద్యాశాఖ అధికారులు -పట్టించుకోని జిల్లా యంత్రాంగం!

**తాండూరు, దశ ప్రతినిధి:**

తాండూరు పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల అరాచకాలు హద్దులు దాటాయి. ప్రభుత్వ నిబంధనలను, విద్యాశాఖ ఆదేశాలను బూట్ల కింద తొక్కేస్తూ తమ సొంత 'కూర్మాసన' రాజ్యాంగాన్ని చలామణి చేస్తున్నాయి. చదువు పేరిట ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏకంగా 12 గంటల పాటు పసిమొగ్గలను తరగతి గదుల్లో బంధించి పిప్పి చేస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. ఉదయం కన్ను విప్పింది మొదలు రాత్రి పూట ఇళ్లకు చేరేవరకు విద్యార్థులను మనుషులుగా కాకుండా కేవలం మార్కులు తెచ్చే రోబోలా మారుస్తున్నారు. ఆటపాటలు, సృజనాత్మకత అనే పదాలకే తావులేకుండా చేసి, విపరీతమైన పుస్తకాల మోతతో విద్యార్థులను తీవ్ర మానసిక ఆందోళనలోకి నెట్టేస్తున్నారు. రాత్రి ఇళ్లకు వచ్చేసరికి పిల్లలు ప్రాణమున్న శవాల్లా మారుతుంటే, కనీసం తల్లిదండ్రులతో కాసేపు ప్రశాంతంగా మాట్లాడే సమయం కూడా దక్కడం లేదు. వ్యాపార ధోరణితో ప్రైవేట్ యాజమాన్యాలు ఆడుతున్న ఈ ర్యాంకుల వేటలో పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి పోతోందని మేధావులు మండిపడుతున్నారు.తాండూరులో ప్రైవేట్ విద్యాసంస్థలు బహిరంగంగానే రూల్స్ బ్రేక్ చేస్తున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు కనీసం కన్నుతెరిచి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున మామూళ్ల పంపిణీ జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రైవేట్ యాజమాన్యాలకు కొమ్ముకాసే ధోరణి చూస్తుంటే తాండూరులో అసలు ప్రభుత్వ విద్యాశాఖ ఉందా? లేక ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లో బందీ అయిందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నిద్రమత్తు వదిలి తక్షణమే తాండూరులోని ప్రైవేట్ విద్యాసంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమయాతిక్రమణకు పాల్పడుతూ నిబంధనలు ధిక్కరిస్తున్న పాఠశాలలు, కళాశాలల గుర్తింపును తక్షణమే రద్దు చేసి, లైసెన్సులు రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎప్పుడూ చదువులే



**వికారాబాద్ జిల్లాలలో కార్పొరేట్ పాఠశాలలు మరియు కళాశాలల్లో ఎప్పుడు చదువులే. అనే విద్యార్థి యొక్క మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు. రోజుకు 12 గంటలు చదువు చదవడంతో విద్యార్థులు తీవ్ర అలసటకు ఆందోళనకు గురవుతున్నారు. కనీసం తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు ఎంత చదువు ఉండదు. అని ఆలోచన చేయడం లేరు. ఎంత చదివితే అంత బాగా నేర్చుకుంటారని దశలోనే తల్లిదండ్రులు ఉన్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడిని ఆందోళనను తల్లిదండ్రులు కానీ ఉపాధ్యాయులు కానీ పట్టించుకోవడం లేదు. దీనిపై విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేరు.**

# దీన్‌దయాళ్ ఆలోచనలు నేటి తరానికి మార్గదర్శకం

❖ *విద్యార్థుల్లో దేశభక్తి, సృజనాత్మకత పెంపొందించాలి: ఎమ్మెల్సీ మల్క కొమరయ్య*

**దశ, ఓయూ:** సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతే లక్ష్యంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ప్రతిపాదించిన 'అంత్యోదయ', 'ఏకాత్మక మానవవాదం' సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని బీజేపీ ఎమ్మెల్సీ, శాసన మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మల్క కొమరయ్య అన్నారు. నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'సేవా సంకల్ప్ అభియాన్-వై విజన్ ఫర్ ఎ డెవలప్డ్ ఇండియా'లో భాగంగా బీజేపీ టీచర్ సెల్ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించే అంశంపై చర్చించారు. విద్యార్థుల్లో పుస్తక జ్ఞానంతో పాటు దేశభక్తి, సామాజిక బాధ్యత, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని మల్క కొమరయ్య పేర్కొన్నారు. వికసిత్ భారత్‌పై విద్యార్థుల ఆలోచనలు, అభిప్రాయాలను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ టీచర్ సెల్ ప్రతినిధులు వొడ్నాల రాజశేఖర్, శివరామ్‌తో పాటు వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు, యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# శిల్పి కాలనీలో ఘనంగా గణేశ్ ప్రసాదాల వేలం



**దశ, పెద్ద అంబర్‌పేట్:** శిల్పి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, శిల్పి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రసాదాల వేలం ఉత్సాహంగా జరిగింది. కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేలంలో ఉత్సాహంగా పోటీపడ్డారు.

ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో నాంపల్లి రామకృష్ణారెడ్డి రూ.80,116కు లడ్డూను దక్కించుకున్నారు. కలశం వేలంలో బండ కృష్ణారెడ్డి రూ.36,116కు కలశాన్ని సొంతం చేసుకున్నారు. అలాగే వస్త్రం వేలంలో లింగమనేని పూర్ణచందర్‌రావు రూ.3,516కు దక్కించుకున్నారు.

వేలం కార్యక్రమానికి కాలనీ వాసులు, భక్తులు విశేషంగా స్పందించి తమ వంతు సహకారం అందించారు. భక్తుల భాగస్వామ్యం, విరాళాలతో గణేశ్ ఉత్సవాలు ఘనంగా విజయవంతమయ్యాయని ఉత్సవ సమితి నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ శిల్పి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. శ్రీ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో కాలనీ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.






# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

❖ *సురకంటి సుమారెడ్డికి రూ.46 వేల ఆర్థిక సాయం*



**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.46 వేల చెక్కును సురకంటి సుమారెడ్డికి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్, చిన్న రావిరాల గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

# తార్నాకలో వినాయక మండపంలో సినీనటులు శివాజీరాజా, చంద్రకాంత్ ప్రత్యేక పూజలు



**దశ ఓయూ:** తార్నాక డివిజన్ మాణికేశ్వరి నగర్‌లో గండికోట విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శుక్రవారం సినీనటులు శివాజీరాజా, చంద్రకాంత్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, భక్తులు వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గిరిబాబు, చిరంజీవి, శంకర్, రాజేష్, నాగరాజు, నర్సింగ్, వెంకటేష్, ఇద్దయ్య, మల్లేష్, గోపి, రాజు, రామ్‌చరణ్, రవి, భరత్, గుణ, నితీష్, ధనుష్, జన, శివ, యశ్, బన్నీ, బిట్టు, భాషా, సాయి తదితరులు పాల్గొన్నారు.

# హబ్సిగూడలో నవకార్ గోల్డ్ ఆధ్వర్యంలో అన్నదానం

❖ *5 వేల మందికి అన్నప్రసాద వితరణ*



**దశ ఓయూ:** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హబ్సిగూడలో నవకార్ గోల్డ్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 5 వేల మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. నవకార్ గోల్డ్ భాగస్వామి అమిత్ జైన్ మాట్లాడుతూ.. హబ్సిగూడలో తొలిసారిగా గణనాథుడిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం హబ్సిగూడతో పాటు ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నాచారం తదితర ప్రాంతాల్లో సుమారు 50 వాటర్ ఫిల్టర్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లోనూ జైన సమాజం ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అమిత్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నర్సింగ్ విద్యార్థిని హరిణిది హత్యే

*నిందితులను కఠినంగా శిక్షించాలి: ఐద్వా మహిళా సంఘం*



**దశ, కామేపల్లి:** ఖమ్మం నర్సింగ్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఇంద్రపల్లి హరిణి (18) మృతికి కారణమైన వారిని వెంటనే గుర్తించి, అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా మహిళా సంఘం కారేపల్లి మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. శుక్రవారం కారేపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం నర్సింగ్ కళాశాలలో చదువుతున్న హరిణి సెలవుల నిమిత్తం తన స్వగ్రామమైన జూలూరుపాడు మండలం వెంకటాపురానికి వెళ్ళిందని తెలిపారు. ఆమె తల్లి కూలి పనికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి బాత్రూం వెనుక భాగంలో హరిణి మృతదేహమై పడి ఉండటాన్ని గుర్తించారని పేర్కొన్నారు.

హరిణి ఒంటిపై గాయాలు, రక్తపు మరకలు, దుస్తులు చిరిగిపోయి ఉండటంతో ఆమె మృతిపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హరిణి మృతిపై సమగ్రంగా దర్యాప్తు జరిపి హంతకులను తక్షణమే అరెస్టు చేయాలని ఉమావతి డిమాండ్ చేశారు. దేశంలో బాలికలు, మహిళలపై హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, ప్రేమ పేరుతో మైనర్ బాలికలను మోసం చేయడం వంటి అఘాయిత్యాలు రోజురోజుకూ పెరుగుతుండటంపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దిశ, నిర్భయ, పోక్సో వంటి చట్టాలు ఉన్నప్పటికీ మహిళలు, బాలికలపై దాడులను అరికట్టడంలో అధికార యంత్రాంగం, పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.




# నాటి 64 రోజుల సమ్మె నుంచి నేటి రెండు డీఏల వరకు – ఉద్యోగ ఉద్యమ ప్రస్థానం

## కాలం మారింది... పోరాట రూపం మారింది... ఉద్యోగుల హక్కుల సాధన లక్ష్యం మాత్రం మారలేదు

ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమ చరిత్రను పరిశీలిస్తే, పే రివిజన్ కరువు భత్యం ఉద్యోగుల ఆర్థిక భద్రతలో అత్యంత ముఖ్యమైన అంశాలు. పెరుగుతున్న ధరల ప్రభావాన్ని కొంతవరకు భర్తీ చేసి ఉద్యోగులు, పెన్షనర్ల కొనుగోలు శక్తిని కాపాడేందుకు ఇచ్చే డీఏ కోసం గతంలో ఉద్యోగ సంఘాలు అనేక ఉద్యమాలు నిర్వహించాయి. నేటికీ డీఏ ఉద్యోగుల, పెన్షనర్ల ప్రధాన ఆర్థిక డిమాండ్లలో ఒకటిగానే కొనసాగుతోంది.

### నాడు 64 రోజుల సమ్మె



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఉద్యోగుల సమస్యలపై ఉద్యమం తీవ్రస్థాయికి చేరింది. ప్రభుత్వ ఉద్యోగులు ఏకంగా 64 రోజులపాటు నిరవధిక సమ్మె ఉద్యోగ ఉపాధ్యాయుల ఉద్యమ చరిత్రలో మరువలేనిది

ఉద్యోగుల వేతనాలు, కరువు భత్యం, ఇతర సేవా ప్రయోజనాలు వంటి ఆర్థిక అంశాలు ఉద్యోగ సంఘాల కార్యాచరణలో ప్రధానమైనవి. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ఉద్యోగులు దీర్ఘకాల సమ్మె వంటి ఉద్యమ మార్గాన్ని కూడా ఎంచుకున్నారు.

64 రోజుల సమ్మె అంటే సాధారణ విషయం కాదు. జీతనష్టం, కుటుంబాలపై ఆర్థిక భారం, ప్రభుత్వంతో ఏర్పడే ప్రతిష్టంభన వంటి పరిణామాలను ఎదుర్కొంటూనే ఉద్యోగులు సంఘటితంగా ఉద్యమించడం అప్పటి ఉద్యోగ సంఘాల పోరాట చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది.

అయితే ఆ సమ్మె కేవలం డీఏ కోసమే జరిగింది అని చెప్పడం కంటే, డీఏ సహా ఉద్యోగుల వేతన-సేవా సమస్యలపై జరిగిన విస్తృత ఉద్యమంగా పేర్కొనడం చారిత్రకంగా సముచితం.



### నేడు చర్చల ద్వారా రెండు డీఏల దిశగా...

దాదాపు ఆరు దశాబ్దాల తరువాత తెలంగాణలో పరిస్థితులు, ఉద్యమ పద్ధతులు మారాయి. కానీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆర్థిక సమస్యలలో డీఏ ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు.

పెండింగ్ డీఏలు, పీఆర్సీ, సీపీఎస్ రద్దు-పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, పెండింగ్ బిల్లులు తదితర సమస్యలపై

2026 సెప్టెంబర్ 23న ప్రభుత్వము తో జరిగిన చర్చల అనంతరం రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసినట్లు జేఏసీ నాయకులు వెల్లడించారు. మిగిలిన ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి స్పష్టమైన కాలపరిమితి కావాలని పేర్కొంది. అందువల్ల రెండు డీఏల అంశాన్ని ఉద్యోగ సంఘాల నిరంతర కార్యాచరణలో ఒక ముఖ్యమైన పరిణామంగా చూడవచ్చు.

### నాడు సమ్మె – నేడు చర్చలు

ఇక్కడే రెండు కాలాల మధ్య ఆసక్తికరమైన పోలిక కనిపిస్తుంది.

నాడు ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం 64 రోజులపాటు నిరవధిక సమ్మె చేసే స్థాయికి వెళ్లారు.

నేడు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, సంఘటిత కార్యాచరణతో పాటు ప్రభుత్వంతో ప్రత్యక్ష చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నం జరుగుతోంది.

అప్పట్లో సమ్మె ప్రధాన ఒత్తిడి సాధనంగా కనిపిస్తే, నేడు ఉద్యమ కార్యాచరణతోపాటు చర్చలు, సంప్రదింపులు కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి.

**అంటే పోరాట పద్ధతి మారింది తప్ప ఉద్యోగుల హక్కుల సాధన లక్ష్యం మారలేదు.**

### రెండు డీఏలతోనే సమస్యలు ముగిసినట్లా?

రెండు డీఏల విడుదల దిశగా ప్రభుత్వం స్పందించడం ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా ఉపశమనం కలిగించే పరిణామమే. అయితే దీనితో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారమైనట్లు భావించలేం.

పీఆర్సీ అమలు, మిగిలిన పెండింగ్ డీఏలు, ఉద్యోగులు-పెన్షనర్ల పెండింగ్ బిల్లులు, పాత పెన్షన్ విధానం వంటి కీలక సమస్యలపై ఇంకా నిర్ణయాలు రావాల్సి ఉంది.

అందువల్ల రెండు డీఏల అంశాన్ని ముగింపుగా కాకుండా సమస్యల పరిష్కార ప్రక్రియలో ఒక అడుగుగా చూడటం సముచితం.


### చరిత్ర చెప్పే సందేశం

నాటి 64 రోజుల సమ్మె అయినా, నేటి జేఏసీల ఉద్యమాలు-చర్చలు అయినా ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఉద్యోగులు సంఘటితంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం, ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యమైన ప్రక్రియ.

ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులను ఉద్యోగ సంఘాలు అర్థం చేసుకోవడం ఎంత అవసరమో, ఉద్యోగుల-పెన్షనర్లకు చట్టబద్ధంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించడం కూడా అంతే అవసరం.

**నాడు 64 రోజుల సమ్మె...**
**నేడు TGEJAC ఉద్యమ కార్యాచరణ, చర్చలు...**
**మారింది పోరాట రూపం.**
**కానీ ఉద్యోగుల పెన్షనర్ల హక్కులు మరియు ఆర్థిక ప్రయోజనాల సాధన అనే ఆకాంక్ష మాత్రం మారలేదు**

ఈ చరిత్రను గుర్తుంచుకుంటూ ప్రభుత్వం-ఉద్యోగ సంఘాల మధ్య పరస్పర చర్చలు కొనసాగి, పెండింగ్‌లో ఉన్న మిగిలిన సమస్యలకు కూడా సకాలంలో పరిష్కారం లభించాలని ఉద్యోగులు, పెన్షనర్లు ఆశిస్తున్నారు.




**మహమ్మద్ ఉస్మాన్ పాషా,**
అధ్యక్షులు
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం
కరీంనగర్ జిల్లా శాఖ

## పాలకుర్తి వెలుగు పాఠశాలలో వైద్యాధికారుల పర్యవేక్షణ

*విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టి*



**దశ, జనగామ:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వాణిశ్రీ శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి పాలకుర్తి వెలుగు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సుమారు 400 నుంచి 500 మంది విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల్లో ఎలుకలు కరిచిన గాయాలు, గుర్తులు లేదా జ్వరం వంటి ఎలాంటి లక్షణాలు కనిపించలేదని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. విద్యార్థులు నిత్యం వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఏవైనా అనుకోని సంఘటనలు లేదా శారీరక అసౌకర్యాలు ఎదురైతే తక్షణమే తరగతి ఉపాధ్యాయులు లేదా పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించాలని సూచించారు. ఇప్పటికే ప్రభావితమైన విద్యార్థులకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ డోసులను ఎలాంటి విరామం లేకుండా పాఠశాలలోనే వైద్య సిబ్బంది పర్యవేక్షణలో పూర్తి చేయాలని పాలకుర్తి పీహెచ్‌సీ వైద్య బృందాన్ని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. పాఠశాల గదుల కిటికీలు, తలుపులకు మెష్ (జాలి) డోర్లు బిగించి ఎలుకలు, పాములు, తేళ్లు, ఇతర ప్రమాదకర కీటకాలు లోపలికి రాకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించారు.

## రేపు ఫొటోగ్రాఫర్స్ సంఘం ఎన్నికలు

**దశ, మంగపేట:** ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు రేపు జరగనున్న నేపథ్యంలో మంగపేట మండలానికి చెందిన ఫోటోగ్రాఫర్స్ అందరూ తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంగపేట ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వడ్లకొండ ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్ల సంక్షేమం, భవిష్యత్ హక్కుల సాధన కోసం బలమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల రోజున మండలం నుండి ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొని, ఓటింగ్ ప్రక్రియను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉండే ప్రతినిధులను ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## అయ్యవారిపల్లిలో అవగాహన సదస్సు



**దశ, చిన్నంబావి:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ పథకాల ఫలాలు పొందాలంటే రైతులకు ఇకనుంచి కచ్చితంగా 11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డు (ఫార్మర్ ఐడీ) ఉండాలని అధికారుల బృందం తెలిపింది. శుక్రవారం చిన్నంబావి మండలం అయ్యవారిపల్లి గ్రామంలో రైతుల విశిష్ట గుర్తింపు కార్డు నమోదుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ.. 11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డు ఉన్న రైతులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పథకాలైన పిఎం కిసాన్, పంటల బీమా తదితర సంక్షేమ ఫలాలు సకాలంలో అందుతాయని స్పష్టం చేశారు. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో రైతులు సాగు చేసిన పంటల పూర్తి వివరాలు తెలుసుకోవడానికి, నష్టపరిహారం వేగంగా అందించడానికి ఈ వివరాల నమోదు ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. కావున ప్రతి ఒక్క రైతు తమ ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ని సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. చిన్నంబావి మండలానికి సంబంధించి మొత్తం 10,869 మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు 8,051 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని అధికారులు వెల్లడించారు.

## ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు చెక్

*రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై అధికారుల ఆగ్రహం*

**దశ, చిన్నంబావి :** గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చిన్నంబావి మండలంలో చేపట్టిన రూ.2.75 కోట్ల విలువైన పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ సమావేశానికి డీఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి, ఏపీడీ సయ్యద్ సుల్తాన్ హాజరై గ్రామాల వారీగా రూపొందించిన సామాజిక తనిఖీ నివేదికలను క్షుణ్ణంగా సమీక్షించారు. గత వారం రోజులుగా రిసోర్స్ పర్సన్లు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులు, కూలీల హాజరు, వేతనాల చెల్లింపులు, మస్టర్లు, రిజిస్టర్లు తదితర రికార్డులను పరిశీలించారు. పనులు నిబంధనల ప్రకారం జరిగాయా? కూలీలకు వేతనాలు సక్రమంగా అందాయా? అనే అంశాలపై క్షేత్రస్థాయిలో కూలీల నుంచి వివరాలు సేకరించారు.

**రూ.2.42 కోట్లు కూలీల వేతనాలు**

గత ఆర్థిక సంవత్సరంలో మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.2.75 కోట్లతో ఫీడర్ ఛానళ్లు, సీసీ రోడ్లు, ల్యాండ్ లెవెలింగ్, క్యాటిల్ షెడ్ల నిర్మాణాలు తదితర పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కూలీలకు రూ.2.42 కోట్ల మేర వేతనాలు చెల్లించగా, రూ.33.18 లక్షల వరకు సామగ్రి (మెటీరియల్) వ్యయం జరిగినట్లు వివరించారు.

## AI నుంచి Agentic AI వరకు.. పల్లవి ఇంజినీరింగ్‌లో సాంకేతిక సెషన్లు




- *AICTE–ATAL VAANI వర్క్‌షాప్‌లో రెండు కీలక సాంకేతిక సెషన్లు.*
- *ML, DLతో పాటు ఆరోగ్య రంగంలో Agentic AI వినియోగంపై అవగాహన.*

**దశ, పెద్ద అంబర్ పేట :** పల్లవి ఇంజినీరింగ్ కళాశాలలో AICTE-ATAL ఆధ్వర్యంలో VAANI (Vernacular AI Network for New India) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మూడు రోజుల వర్క్‌షాప్‌లో శుక్రవారం రెండు కీలక సాంకేతిక సెషన్లు నిర్వహించారు. తొలి సెషన్‌లో డా. షేక్ ఫయిరూజ్ మెషిన్ లెర్నింగ్ (ML), డీప్ లెర్నింగ్ (DL) సాంకేతికతలను వైద్యం, వ్యవసాయం, విద్య, IoT, స్మార్ట్ సిస్టమ్స్ తదితర రంగాల్లో ఎలా వినియోగించుకోవచ్చో వివరించారు. డేటా సేకరణ నుంచి మోడల్ అభివృద్ధి, పరీక్షలు, అమలు వరకు వివిధ దశలను ఆచరణాత్మక ఉదాహరణలతో వివరించారు.

రెండో సెషన్‌లో డా. ఏ. సాయి హరీష్ "Agentic AI for Healthcare Systems" అంశంపై అవగాహన కల్పించారు. ఆరోగ్య రంగంలో AI ప్రస్తుత వినియోగం, భవిష్యత్తులో Agentic AI ద్వారా వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా, మరింత సమర్థవంతమైన ఆరోగ్య సేవలను అభివృద్ధి చేసే విధానాలను వివరించారు. ప్రత్యేక Case Study ద్వారా వాస్తవ సమస్యను గుర్తించడం నుంచి AI ఆధారిత పరిష్కారం రూపొందించే వరకు దశలను వివరించారు. ప్రశ్నోత్తర కార్యక్రమంలో పాల్గొన్న వారి సందేహాలను నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధి బీరెల్లి కమలాకర్ రావు, కార్యక్రమ సమన్వయకర్త, ప్రిన్సిపల్ డా. జె.బి.వి. సుబ్రహ్మణ్యం, సహ సమన్వయకర్త, ప్రొఫెసర్ అండ్ హెడ్-CSE డా. బి. నవీన్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా. ఆర్. ప్రశాంత్ కుమార్, కోకోఆర్డినేటర్ వై. పవన్ కుమార్ గుప్తా, IQAC కోఆర్డినేటర్ ధనుంజయ రావు కొడాలి పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ విభాగాల అధిపతులు, కళాశాల అధ్యాపకులు, ఇతర కళాశాలల అధ్యాపకులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, సాంకేతిక, మీడియా బృందాలు, విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు. ఆధునిక AI సాంకేతికతలను వాస్తవ అనువర్తనాలతో అనుసంధానించిన ఈ సెషన్లు పాల్గొన్న వారిలో సాంకేతిక అవగాహన, పరిశోధనా ఆసక్తిని పెంపొందించాయి.

## ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

- *అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం*

**దశ, ఆసిఫాబాద్:** వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 1 నుంచి జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి వ్యవసాయ విస్తరణ అధికారులు, సహకార శాఖ, ఐకేపీ సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సుమారు 23,900 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, విద్యుత్ తదితర మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. ఎత్తైన, చదునైన ప్రదేశాల్, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ప్రధాన రహదారులకు సమీపంలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొనుగోళ్లకు అవసరమైన గోనె సంచులు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, డ్రైయర్లు, హమాలీలను ముందస్తుగా సిద్ధం చేయాలని, ప్రతి కేంద్రంలో కనీసం రెండు ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

**నాణ్యతా ప్రమాణాలు..**



17 శాతం లోపు తేమతో, తాలు, దుమ్ము లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూకం పూర్తయిన వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాలని, ధాన్యం నిల్వకు అవసరమైన గోదాములను సిద్ధంగా ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం అందించే క్వింటాల్‌కు రూ.500 బోనస్ వివరాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా పౌరసరఫరాల అధికారి వాజీద్, జిల్లా సహకార అధికారి, ఐకేపీ ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.